సాక్షి జనగామ

శనివారం | 12 | జూలై | 2025



విద్యుత్ అంతరాయాలు తగ్గాలి
విద్యుత్ అంతరాయాలు తగ్గి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. - 8లో▸



పెరుగుతున్న గోదావరి
ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో గోదావరి వరద ప్రవాహం పెరుగుతోంది. దీంతో ములుగు జిల్లాలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. - 8లో▸



వాతావరణం
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఖిలాషాపూర్ ఉన్నత పాఠశాలకు ఓపెన్ స్కూల్ మంజూరు

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ ఉన్నత పాఠశాలకు నూతనంగా 2025–26 విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (స్టడీ సెంటర్) మంజూరైనట్లు పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ భారత రవీందర్ శుక్రవారం తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 10వ తరగతి, ఇంటర్ (ఆర్ట్స్ సబ్జెక్ట్స్) అడ్మిషన్స్ తీసుకోనున్నట్లు తెలిపారు. టీఓఎస్ఎస్ అడ్మిషన్ షెడ్యూల్ ప్రకారం 10వ తరగతి మధ్యలోనే ఆపేసిన, 14 సంవత్సరాలు నిండిన ఆసక్తి గల డ్రాపౌట్ విద్యార్థులు, యువత, మహిళలు తగిన ఆధారాలతో ఉన్నత పాఠశాలలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 9912536316, 9849760972 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలి



జనగామ: రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతూ విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర ప్రతినిధి రావుల రామ్మోహన్‌రెడ్డి బృందం శుక్రవారం విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టెట్ ఫలితాలు వచ్చిన వెంటనే 10 వేల టీచర్ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. డైట్, బీఎడ్ లెక్చరర్‌కు సంబంధించి డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ పోస్టులకు కూడా నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. వచ్చే టెట్ నుంచి గణితం, సైన్స్ వారికి వేర్వేరుగా టెట్ నిర్వహించడంతో పాటు భాష పండిట్ అభ్యర్థులకు ప్రత్యేకంగా నిర్వహించే అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

భూగర్భ జలాల పెంపు అందరి బాధ్యత

- జిల్లా పంచాయతీ అధికారి స్వరూప



దేవరుప్పుల: భూగర్భ జలాలు పెంపు అందరు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి స్వరూప అన్నారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో నీటి నిల్వలు తగ్గుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి ఆవరణలో ఇంకుడుగుంతలను నిర్మించుకోవాలన్నారు. జిల్లాలో ఐదు వేల ఇంకుడు గుంతల నిర్మించడం లక్ష్యం కాగా ఇప్పటికే నాలుగు వేలకు పైగా నిర్మాణం పూర్తయ్యాయన్నారు.


15, 16న క్రీడా శిక్షణ కేంద్రాల్లో ప్రవేశాలకు ఎంపిక

జనగామ రూరల్: తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఎల్‌బీ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా శిక్షణ కేంద్రాల్లో ప్రవేశాల ఎంపికకు ఆసక్తిగల వారు పాల్గొనాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. ఈనెల 15, 16 తేదీల్లో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. హాకీ, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్‌లో బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలన్నారు.

ఎమ్మెల్యే పల్లాకు సీఎం శుభాకాంక్షలు

జనగామ: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని సీఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ మెసేంజర్ ద్వారా శుక్రవారం హృదయపూర్వక పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో నిమగ్నమై రాష్ట్ర అభివృద్ధి, ప్రజాపాలనలో భాగస్వామ్యం కావడానికి భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మెసేజ్‌లో సీఎం పేర్కొన్నారు.

పద్మాక్షి అమ్మవారికి పుష్పార్చన



హన్మకొండ అర్బన్ : శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా నగరంలోని పద్మాక్షి కాలనీలో గల శ్రీ హనుమద్గిరి పద్మాక్షి అమ్మవారికి శుక్రవారం పుష్పార్చన నిర్వహించినట్లు అర్చకులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని, శంకర్ శర్మ తెలిపారు. పద్మాక్షి అమ్మవారికి తీరొక్క పూలతో అలంకరించి హారతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించగా 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, కాకతీయ ఆస్పత్రి యజమాన్యం డాక్టర్ ప్రవీణ్–నీరజ దంపతులు ప్రారంభించినట్లు తెలిపారు. ఆలయ ట్రస్ట్ కోశాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, కార్యదర్శి నీలారపు రాజ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ 83.29శాతం

- రూ.4.15 కోట్ల ఖర్చు
- జిల్లాలో 3,357.03 హెక్టార్లలో అటవీ ప్రాంతం
- తొమ్మిదేళ్లలో 0.5 శాతం పెరుగుదల
- ఈ సంవత్సరం లక్ష్యం 14,400
- ఒక్కో మొక్కకు రూ.86 ఖర్చు



అటవీ ప్రాంతంలో నాటుతున్న మొక్కలు



నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు


జనగామ: అటవీ ప్రాంతంలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక ఫోకస్ సారిస్తున్నారు. నాటిన ప్రతీ మొక్కను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ జిల్లాలో గడిచిన తొమ్మిదేళ్ల లెక్కలను పరిశీలిస్తే అటవీ ప్రాంతం కేవలం 0.5 శాతం మాత్రమే పెరిగింది. 2015కు మందు ఒక శాతం ఫారెస్ట్ ఏరియా ఉండగా... డబుల్ చేసేందుకు నాటి నుంచి నేటి వరకు కష్టపడినా.. ఫలితం కనిపించడం లేదు. మండలాల పరిధిలో ఎక్కువగా అటవీ ప్రాంతం లేకపోవడంతో అధికారులు ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేక పోతున్నారు. ఒక్కో మొక్కను పెంచి పెద్ద చేసి, నాటే వరకు రూ.86 ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో పచ్చదనం ఏటా అటవీ ప్రాంతం విస్తీర్ణం పెరుగుదల తదితర అంశాలపై సాక్షి ప్రత్యేక కథనం.

తొమ్మిదేళ్లు..4.83 కోట్ల మొక్కలు

జనగామ ప్రత్యేక జిల్లాగా ఆవిర్భవించిన తర్వాత అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాలో అతి తక్కువ అటవీ ప్రాంతం కలిగిన జిల్లాలో జనగామ ఒకటి. కేవలం ఒకే ఒక్క అటవీ ప్రాంతంతో ఉన్న జిల్లాలో రెండు నుంచి మూడుకు పెంచాలని నాటి కలెక్టర్ దేవసేన నుంచి ప్రస్తుత జిల్లా బాస్ రిజ్వాన్ బాషా వరకు కృషి చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ 0.5 శాతం మాత్రమే పెంచగలిగారు. ఎక్కువగా ఫారెస్ట్ ఏరియా లేకపోవడం, సాగు పెరగడం ఇందుకు కారణంగా చెప్పుకోవచ్చు. 2016 నుంచి 2024 వరకు 5.80 కోట్ల మొక్కల లక్ష్యం కాగా 4.83 కోట్లు నాటారు. ఇందులో 83.29 శాతం మేర మొక్కలను సంరక్షించగలిగారు.

2.18 లక్షల హెక్టార్ల భౌగోళిక ప్రాంతం

జనగామలో 2,18,750 హెక్టార్ల భౌగోళిక ప్రాంతం ఉండగా, ఇందులో లింగాలఘణపురం, జనగామ, కొడకండ్ల మినహా 9 మండలాల పరిధిలో 3,357.03 హెక్టార్ల మేర అటవీ ప్రాంతం (1.05 శాతం) విస్తరించి ఉంది. జనగామ, నర్మెట మండలం మెవెల్దండ గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీలు ఉండగా, బచ్చన్నపేట మండలం మన్సాన్‌పల్లిలో త్వరలోనే ప్రారంభించనున్నారు. వీటి పరిధిలో 1.20లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండగా, ఇటీవల పురపాలికలోని 30 వార్డుల్లో నాటేందుకు 12,500 మొక్కలను వెల్దండ, మరో 10 వేలను జనగామ నర్సరీ నుంచి సరఫరా చేశారు. మొక్కను పెంచేందుకు రూ.12, నాటేందుకు (అన్ని కలుపుకుని) రూ.74 మేర మొత్తంగా రూ.86 ఖర్చు చేస్తున్నారు. ఈ లెక్కన తొమ్మిదేళ్లలో రూ.4.15 కోట్ల మేర ఖర్చు చేయగా, మంచి ఫలితాలు వచ్చాయని చెప్పుకోవచ్చు. వందశాతం మొక్కలు నాటే సమయంలో ఇందులో ఎండి, విరిగి పోవడం, చెదలు పట్టడంతో 10 నుంచి 20 శాతం మేర నష్టం వచ్చే అవకాశం ఉంటుంది. వీటి స్థానంలో కొత్త మొక్కలను నాటి వందశాతం ఫలితాలను తీసుకు వచ్చేలా ప్రయత్నం చేస్తున్నారు. 10వేల మొక్కలకు ఒక వాచర్‌ను ఏర్పాటు చేసి రెండేళ్ల పాటు మొక్కల సంరక్షణ బాధ్యతను అప్పగిస్తున్నారు. ప్రస్తుత వనమహోత్సవంలో 2025 వార్షిక టార్గెట్ అన్ని శాఖలు కలుపుకొని 33 లక్షలు ఉండగా అటవీశాఖ 14,400 మొక్కలు నాటాల్సి ఉంది.



జిల్లాలో అటవీ విస్తీర్ణం

జిల్లా భౌగోళిక ప్రాంతం:	2,18,750 హెక్టార్లు
అటవీ ప్రాంతం:	3,357.03హెక్టార్లు
అటవీ శాతం:	1.05శాతం

మొక్కల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ



జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం. 12 మండలాల పరిధిలో పెద్దగా అటవీ ప్రాంతం లేదు. ప్రస్తుతం 3,357.03హెక్టార్ల పరిధిలో మాత్రమే పారెస్ట్ ఏరియా ఉండగా, పొలం గట్లు, చెరువు కట్టలు, వ్యవసాయ క్షేత్రాలు, ఇతర ప్రదేశాల్లో మొక్కలు నాటి కొంత మేర అటవీ ప్రాంతాన్ని పెంచుకునే అవకాశం ఉంటుంది. ఇందు కోసం రైతులను కూడా ప్రోత్సహిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు వనమహోత్సవం ప్రోగ్రాంలో అటవీ శాఖ ప్రధాన భూమిక పోషిస్తోంది. 9 సంవత్సరాల్లో మంచి ఫలితాలు సాధించి, 2025 వార్షిక సంవత్సరానికి 14,400 మొక్కల పెంపకం లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. నాటిన మొక్కలు వాడి పోవడం, ఎండటం, చెదలు పట్టకుండా మందులు చల్లుతూ వాచర్ పర్యవేక్షణలో నిత్యం దృష్టి సారిస్తున్నాం. ఒకవేళ 10 నుంచి 20 శాతం లోపు మొక్కలకు నష్టం కలిగితే వాటి స్థానంలో మళ్లీ మొక్క నాటుతున్నాం. వందశాతం ఫలితాలు వచ్చేలా అందరి భాగస్వామ్యంతో కష్టపడుతున్నాం.

- కొండల్‌రెడ్డి, ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్

ప్రజాసమస్యలు పరిష్కరించాలని ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

జనగామ రూరల్: పట్టణంలో పేరుకుపోయిన ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులు ప్రజలకు సక్రమంగా సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య కార్మికులు జనాభాకు అనుగుణంగా లేకపోవడంతో పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో దుర్వాసన వస్తుందన్నారు. ఏసి రెడ్డి నగర్‌లో డబుల్ బెడ్రూంలో సీసీ రోడ్డు డ్రెయినేజీ నిర్మించాలని, అర్హులైన పేదలందరికీ కొత్త పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు అహల్య, బొట్ల శేఖర్, బూడిది గోపి, చుంచు విజయేందర్, చందు నాయక్, పాతుకునూరి ఉపేందర్, కల్యాణం లింగం పల్లెలు లలిత, పందిళ్ల కల్యాణి, బొట్ల శ్రావణ్, పాము కుంట్ల చందు, పాము శ్రీకాంత్, పగిడిపల్లి బాలమణి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

రఘునాథపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలపై పార్టీ శ్రేణులు పోరాటాలకు సిద్ధంగా కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం మండలంలోని కుర్చపల్లిలో సీపీఎం రెండు రోజుల మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, గంగాపురం మహేందర్, కాసాని పుల్లయ్య, మంచాల మల్లేష్, బీమగోని చంద్రయ్య, మైలారపు వెంకటేశ్వర్లు, యాదగిరి, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ ఇంటర్న్‌షిప్



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సమ్మర్ ఇంటర్న్‌షిప్–25 ప్రోగ్రాం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ హాజరై సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. నిట్ వరంగల్‌లో తొలిసారిగా మే 9వ తేదీన ప్రవేశపెట్టిన సమ్మర్ ఇంటర్న్‌షిప్‌నకు అనూహ్య స్పందన లభించిందని, యూజీ, పీజీ నుంచి 194 విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఇక ప్రతిఏటా సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్, ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి, ప్రొఫెసర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్
- ఎంజేపీల్లో వనమహోత్సవం




మొక్క నాటుతున్న రవీందర్

జనగామ రూరల్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బీసీ వెల్ఫేర్ అధికారి బి. రవీందర్ అన్నారు. జనగామలోని రైల్వే ట్రాక్ వద్ద గల ఎంజేపీ బాలుర పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్వర్యంలో శుక్రవారం బీసీ వెల్ఫేర్ అధికారి బి.రవీందర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మొక్కలు నాటారు. పెంబర్తి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, బచ్చన్నపేట మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలికల జూనియర్ కాలేజీ, పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 200 వందల మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ పచ్చటి ఆహ్లాదకరమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలి మంచి ఆరోగ్యాన్ని కలిగిస్తాయని, మొక్కలను మనం కాపాడితే అవి మనల్ని కాపాడుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో స్టేషన్‌ఘన్‌పూర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎం.అనిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

9999 @రూ.11లక్షలు

- వాహన ఫ్యాన్సీ నంబర్‌కు వెచ్చించిన ఓ వ్యాపారి



ఫ్యాన్సీ నంబర్ 9999

ఖిలా వరంగల్ : వరంగల్ నగరానికి చెందిన ఓ వ్యాపారి అధిక మొత్తంలో చెల్లించి ఫ్యాన్సీ నంబర్‌ను దక్కించుకున్నట్లు వరంగల్ ఇన్‌చార్జ్ ఆర్టీఓ శోభన్‌బాబు శుక్రవారం తెలిపారు. కారు నంబర్ ప్లేట్‌పై తనకు నచ్చిన లక్కీ నంబర్ ఉండాలనే ఆశతో 9999 ఫ్యాన్సీ నంబర్‌ను ఆన్‌లైన్ ద్వారా రూ.11,09,999లు చెల్లించి హర్ష కన్‌స్ట్రక్షన్స్ పేరు మీద దక్కించుకున్నట్లు వివరించారు. ఇంత మొత్తం ఖర్చు చేసి నంబర్ దక్కించుకోవడంపై ఆర్టీఓ అధికారులు సైతం అవాక్కయ్యారు. సదరు వ్యాపారి ఫ్యాన్సీ నంబర్ కోసం చాలా రోజులుగా ప్రయత్నిస్తూ ఈసారి అధిక మొత్తం వెచ్చించి దక్కించుకున్నట్లు చెప్పారు.

సీఎంఆర్‌ను సకాలంలో అందించాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: రబీ, ఖరీఫ్ 2024–25కు గాను సీఎంఆర్‌ను సకాలంలో అందించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రేషన్ కార్డులు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు తదితర అంశాలపై అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి తహసీల్దార్లు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యాలను అనుగుణంగా రైస్ మిల్లర్లు సీఎంఆర్‌ను నిర్ణీత సమయంలో డెలివరీ చేయాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. ఖరీఫ్ (వానాకాలం) 2024–25 సీజన్ కు సంబంధించి 91827.554 మెట్రిక్ టన్నుల బియ్యానికి గాను 73664.210 మెట్రిక్ టన్నుల బియ్యం, 80.22శాతం ఇప్పటికే మిల్లింగ్ చేసి డెలివరీ చేయగా ఇంకా 18163.344 మెట్రిక్ టన్నులు డెలివరీ చేయాల్సి ఉందన్నారు. రబీ (యాసంగి) 2024–25 సీజన్‌కు సంబంధించి 144834.216 మెట్రిక్ టన్నుల బియ్యానికి గాను 38135.916 మెట్రిక్ టన్నుల బియ్యం, 26.33శాతం ఇప్పటికే మిల్లింగ్ చేసి డెలివరీ చేయగా ఇంకా 106698.300 మెట్రిక్ టన్నులు డెలివరీ చేయాల్సి ఉందన్నారు. కొత్తరేషన్ కార్డుల జారీ, పాత రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులకు సంబంధించి ప్రక్రియ వేగవంతం కావాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు, సివిల్ సప్లయీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



ర్యాలీని ప్రారంభిస్తున్న పింకేష్‌కుమార్

జనగామ రూరల్: జనాభా నియంత్రణకు సమష్టిగా కృషి చేసి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎక్కువగా చేపట్టాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్ రావుతో కలిసి అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్టాండ్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు వైద్య సిబ్బందితో జనాభా నియంత్రణపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 1987లో ఐక్యరాజ్య సమితి జనాభా నియంత్రణకు చర్యలు తీసుకోగా 1989 జూలై 11వ తేదీ నుంచి ప్రపంచ జనాభా దినోత్సవంగా పాటించడం జరుగుతుందన్నారు. ఆశ కార్యకర్తలు ఇంటింటి సర్వే చేపట్టికొత్తగా వివాహం జరిగిన మహిళలను గుర్తించి 23 సంవత్సరాలు ఉండి, ఆరోగ్యవంతురాలిగా ఉన్నప్పుడే గర్భం దాల్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులకు తెలియ చెప్పాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ మహిళలు సంపూర్ణ ఆరోగ్య వంతురాలిగా ఉన్నప్పుడు గర్భం దాల్చినట్లయితే గర్భస్రావాల రేటు తగ్గుతుందన్నారు. అత్యధికంగా 700 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసిన డాక్టర్ శకుంతల, మోటివేషన్ పర్సన్ దీపారాణి, ఉత్తమ సేవలందించిన దేవరుప్పుల మండల పీహెచ్‌సీకి చెందిన ఆశకార్యకర్త స్వప్నలను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

- డీఈఓ భోజన్న



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ భోజన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతిఒక్కరూ విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్యసాధనకు ప్రణాళికయుతంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న అన్నారు. మండలంలోని ఛాగల్లు ఉన్నత పాఠశాలను డీఈఓ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని రికార్డులు, రిజిస్టర్లు, టీచర్ల డైరీలు, బేస్ లైన్ పరీక్షల వివరాలు, పాఠ్య ప్రణాళికలు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధన ఎలా ఉంది, పాఠ్యాంశాలు సరిగా అర్థం అవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, వినయం కలిగి ఉండాలని, ఉన్నత చదువుతో సమాజంలో సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులు ఎలాంటి దురలవాట్లకు గురికావద్దని, చదువుపైనే శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధ్యాయుల సూచనల మేరకు ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. వంట చేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ కొమురయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

కామన్ స్కూల్ విద్యావిధానాన్ని అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న టీపీటీఎఫ్ నాయకులు

జనగామ రూరల్: వివిధ యాజమాన్యాల కింద కొనసాగుతున్న పాఠశాలలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకి తీసుకువచ్చి కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉమాపతి కార్యాలయంలో టీపీటీఎఫ్ జిల్లా సబ్ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎస్ రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలన్నారు. ఉపాధ్యాయుల ప్రమోషన్ల, బదిలీల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల వివిధ రకాల బిల్లులను విడుదల చేయాలని, వెంటనే పీఆర్సీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ఎస్ ఎస్ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలన్నింటికీ పదివేల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంకుషావలి, రాష్ట్ర కౌన్సిలర్ కుర్రంల యాదగిరి, సత్యనారాయణ రెడ్డి, వజ్రయ్య, రాజారెడ్డి, లక్ష్మణ్ జి, రాజేందర్, ప్రభాకర్, శారద, కవిత తదితరులు పాల్గొన్నారు.

కుక్కల ఆపరేషన్ @రూ.2.97 లక్షలు

- ఎక్కడ పట్టుకెళ్లారు
- జీపీఎస్ లొకేషన్ ఉందా ?
- వీధుల వెంట గుంపులుగుంపులుగా శునకాలు



గాంధీ సెంటర్‌లో కుక్కల హల్‌చల్

జనగామ: జనగామ మున్సిపల్‌లో కుక్కల సంచారం ప్రజల పాలిట ప్రమాదకరంగా మారింది. ఏ వీధికెళ్లినా ఏ ముందులే అన్నట్టుగా అడుగడుగునా శునకాలు రాజ్యమేలుతున్నాయి. కాలినడకన కనిపించినా.. ద్విచక్రవాహనం వెళ్తున్నా.. కుక్కలు వెంబడిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇటీవల అనేక వార్డుల్లో కుక్కల దాడుల్లో పదుల సంఖ్యలో గాయపడ్డారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఒంటరిగా బయటకు పంపించాలంటేనే వణికిపోతున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది సెప్టెంబర్–అక్టోబర్ మాసంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసేందుకు పురపాలిక అధికారులు నిర్ణయం తీసుకున్నారు. చంపక్‌హిల్స్ డంపింగ్ యార్డు సమీపంలో నిర్మాణం చేసిన జంతువుల జనన నియంత్రణ (ఏబీసీ/కు.ని) సెంటర్‌లో ఈ ఆపరేషన్‌కు సిద్ధం చేశారు. అయితే కుక్కలను పట్టుకునే సమయంలో లొకేషన్‌లో ట్రేస్ అవుట్ చేయాలి. ఆపరేషన్ చేసి, ఆరోగ్యంగా కోలుకున్న తర్వాత ఎక్కడ నుంచి పట్టుకు వెళుతున్నారో, అక్కడే వదిలిపెట్టి పూర్తి ఆధారాలు మున్సిపల్‌లో అందుబాటులో ఉంచుకోవాలి.

180 కుక్కలకు ఆపరేషన్

అధికారుల లెక్కల ప్రకారం విడతల వారీగా 180 కుక్కలను పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు తరలించి కు.ని ఆపరేషన్ చేయించారు. ఆపరేషన్‌కు ముందు మూడు రోజుల పాటు సంరక్షించి, 4వ రోజు సర్జరీ చేస్తారు. మరో మూడు రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉంచుకుని, ఏడవ రోజు కుక్కను పట్టుకు వెళ్లిన ప్రదేశంలో వదిలి వెళ్లాల్సి ఉంటుంది. ఒక్కో శునకం ఆపరేషన్ ఖర్చు కోసం సుమారు రూ.1,650 లెక్కన మొత్తంగా రూ.2.97లక్షల వరకు ఖర్చు చేశారు. కుక్కల సంతతి తగ్గించేందుకు ఆపరేషన్ కార్యక్రమం బాగున్నప్పటికీ, కు.ని తర్వాత వాటిని ఎక్కడ వదిలేశారు.. జీపీఎస్ లొకేషన్ ఎక్కడ? అనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేకుండా పోయింది. పట్టణంలో ఏ వార్డుకు వెళ్లినా పదుల సంఖ్యలో కుక్కలు దాడి చేసే పరిస్థితికి చేరుకున్నాయి. లక్షల రూపాయల ప్రజా ధనం ఖర్చు చేసి, శునకాలకు ఆపరేషన్ చేయించినా, ఫలితం లేదంటున్నారు పట్టణ ప్రజలు. కుక్కల ఆపరేషన్ కోసం చేసిన ఖర్చు వివరాలకు సంబంధించి విచారణ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గోపయ్య మాట్లాడుతూ కుక్కల ఆపరేషన్‌కు రూ.2.97 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పారు. కుక్కలను పట్టుకు వెళ్లిన ప్రదేశం, జీపీఎస్ తమ వద్ద లేదన్నారు.

క్లుప్తంగా

అప్పు తీర్చలేక రైల్వే ఉద్యోగి ఆత్మహత్య


రామక్రిష్ణారెడ్డి (ఫైల్)

కేసముద్రం: అప్పు తీర్చలేక మనస్థాపానికి గురైన ఓ రైల్వే ఉద్యోగి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని బండ్లగూడకు చెందిన కోమటిరెడ్డి రామక్రిష్ణారెడ్డి (38) మూడేళ్లుగా కేసముద్రం మున్సిపాలిటీలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటూ, కురవి మండలంలోని గుండ్రాతి మడుగు రైల్వేస్టేషన్‌లో కీమాన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో నెక్కొండ మండలం సూరిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర అప్పు తీసుకున్నాడు. ఈ క్రమంలో అప్పు ఇచ్చిన వారు ఈనెల 9న ఇంటికి వచ్చి తమ అప్పు తీర్చాలని గొడవకు దిగారు. దాంతో అదే రోజు తీవ్ర మనస్థాపానికి గురైన రామక్రిష్ణారెడ్డి.. గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ నుంచి ఇంటికి వస్తూ కేసముద్రం మండలం రాజీవ్ నగర్ తండా వద్ద గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

రేప్ కేసులో ఐదేళ్ల జైలు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని వాడగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రేప్ కేసులో ఐదేళ్ల జైలుశిక్ష పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వెంకటాపురం సీఐ బండారి కుమార్ వివరాల ప్రకారం రేప్ కేసులో జాడి రోశయ్యకు ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్‌వీపీ సూర్యచంద్రకళ శుక్రవారం ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసు నమోదు చేసిన ఎస్సై రేక అశోక్, దర్యాప్తు చేసిన ఎస్సై కొప్పుల తిరుపతి రావు, శిక్షపడేలా కృషి చేసిన ప్రాసిక్యూటర్, కోర్టు కానిస్టేబుల్‌ను పలువురు అభినందించారు.

చుట్ట తాగుతూ నిద్రలోకి..

నిప్పంటుకొని వృద్ధురాలి మృతి

రఘునాథపల్లి: చుట్ట తాగుతూ ఓ వృద్ధురాలు నిద్రలోకి జారుకోగా.. ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పండుగ వెంకటలక్ష్మి (95) ఒంటరిగా జీవనం సాగిస్తోంది. చుట్ట తాగుడు అలవాటు ఉన్న ఆమె.. గురువారం ఉదయం మంచంపై పడుకొని చుట్ట తాగుతూ నిద్రలోకి జారుకుంది. ప్రమాదవశాత్తు మంచంపై ఉన్న బెడ్‌షీట్లకు చుట్ట అంటుకొని మంటలు లేచాయి. వెంకటలక్ష్మి తేరుకొని లేచే సరికి మంటలు చుట్టుముట్టాయి. ఇంట్లో మంటలను గుర్తించిన స్థానికులు వెంటనే తలుపులు ఊడదీసి మంటలను చల్లార్చగా అప్పటికే ఆమె తీవ్ర గాయాలపాలైంది. వెంటనే జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి కుమారుడు పండుగ మదార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

పెరుగుతున్న గోదావరి


వాజేడు: మండల కేంద్రం సమీపంలో రహదారిపైకి చేరిన గోదావరి వరద


వాజేడు: పూసూరు, ఎడ్జర్లపల్లి మధ్య నీట మునిగిన రహదారి


వాజేడు వద్ద వరద నీటిలోకి వెళ్లకుండా ట్రాక్టర్‌ను అడ్డుగా పెడుతున్న డ్రైవర్

- నీట మునిగిన రహదారులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

వాజేడు: వరద నీరు ఉధృతంగా వస్తుండడంతో గోదావరి వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో గోదావరి మట్టం పెరగడంతో ములుగు జిల్లా వాజేడు మండలంలో రహదారులు పలు చోట్ల ముంపునకు గురి కావడంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని పేరూరు, కృష్ణాపురం గ్రామాల మధ్యన మోడి కుంట వాగు ద్వారా రహదారిపైకి వరద నీరు చేరడంతో కృష్ణాపురం, కడేకల్, పెద్ద గంగారం, చంద్రుపట్ల, టేకులగూడెం, టేకులగూడెం కాలనీ గ్రామాలు, పేరూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాల ప్రజలు పేరూరుకు రావాలంటే జాతీయ రహదారిపై నుంచి చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. అదేవిధంగా మండల కేంద్రం సమీపంలో కొంగల వాగు ద్వారా వచ్చిన గోదావరి వరద రహదారిని ముంచింది. దాంతో వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచాయి. కొంగల వాగు అవతల ఉన్న సుమారు 25 గ్రామాల ప్రజలు వాజేడు మండల కేంద్రానికి రావాలంటే జగన్నాథపురం మీదుగా రావాలి. మండల పరిధిలోని పూసూరు, ఏడ్జర్లపల్లి గ్రామాల మధ్యన ఉన్న వంతెనపైకి వరద నీరు చేరడంతో ఇక్కడ కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏడ్జర్లపల్లి, బొమ్మనపల్లి, ముత్తారం, కొత్తూరు గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి వెంకటాపురం(కె) మీదుగా వాజేడుకు రావాల్సి ఉంది. కోయ వీరాపురం గ్రామ సమీపంలో చాకలి వాగు వద్ద రహదారిపైకి గోదావరి చేరడంతో గ్రామస్తులు చీకుపల్లి మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది.


పూసూరు హైలెవల్ బ్రిడ్జి వద్ద గోదావరి వరద ఉధృతి

పెరుగుతున్న నీటి మట్టం

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు వద్ద గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం గోదావరి నీటి మట్టం 14.28 మీటర్లు ఉండగా, శుక్రవారం సాయంత్రానికి 15.42 మీటర్లకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తుండడంతో గోదావరి నీటి మట్టం పెరుగుతున్నట్లు సీడబ్ల్యూసీ సిబ్బంది తెలిపారు. పూసూరు హైలెవల్ బ్రిడ్జి వద్ద గోదావరి వరద పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఇప్పటికే పలు చోట్ల రహదారులు నీట మునిగాయి. మండల అధికారులు అప్రమత్తమై మండలంలోని పునరావాస కేంద్రాలను శుభ్రం చేసి సిద్ధం చేశారు. వాగులు వంకల వద్దకు ప్రజలు వెళ్లకుండా రహదారులపై ట్రాక్టర్లు అడ్డంగా ఉంచారు.

అప్రమత్తమైన అధికారులు

గోదావరి వరద అంతకంతకు పెరుగుతుండడంతో పాటు పలు చోట్ల రహదారులను ముంచెత్తడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. వరదను పరిశీలించిన తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, ఆర్‌ఐ కుమారస్వామి.. గ్రామ పంచాయతీ సిబ్బందిని ఎక్కడికక్కడ అప్రమత్తం చేశారు. రహదారులపైకి వరద నీరు చేరడంతో నీటిలోకి ఎవరూ వెళ్లకుండా ట్రాక్టర్లు అడ్డంగా పెట్టడమే కాకుండా కర్రలతో అడ్డుగా కంచె కట్టారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

వరద ఉధృతి



సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి భారీగా చేరుతున్న వరద నీరు

- ఎగువ నుంచి 7,35,720 క్యూసెక్కుల నీరు
- బ్యారేజీ వద్ద 59 గేట్లు ఎత్తి అంతేమొత్తంలో దిగువకు..


తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి ఉగ్ర రూపంలో ప్రవహిస్తోంది. బ్యారేజీలోకి ఎగువ నుంచి భారీగా వరదలు చేరడంతో నిండుకుండను తలపిస్తూ దిగువకు వెళ్తోంది. వారం రోజుల నుంచి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సరస్వతి, లక్ష్మీ బ్యారేజీలలోకి భారీగా వరద నీరు చేరడంతో అక్కడ బ్యారేజీల గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దాంతో దిగువన ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి భారీగా వరద చేరుతోంది. ఈ క్రమంలో తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద శుక్రవారం గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుండి 7,35,720 క్యూసెక్కుల నీరు చేరుతోంది. బ్యారేజీ వద్ద అన్ని గేట్లు 59 ఎత్తి అదేమోతాదులో దిగువకు నీటిని వదులుతున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 83.మీటర్లకుగాను 82.10 మీటర్లుగా నమోదవుతోంది. బ్యారేజీకి ఎగువన గుట్టల గంగారం పరిధిలో ఉన్న జె.చొక్కారావు ఎత్తిపోతల వద్ద ఫేజ్ -1లో రెండు మోటార్లకు గాను 1 మోటారు తోపాటు ఫేజ్ -3లో 6 మోటార్లకుగాను రెండు మోటార్ల ద్వారా 760 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎత్తిపోతల వద్ద ప్రస్తుతం 83 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది.

మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో..


రామన్నగూడెం గోదావరి వద్ద సిద్ధంగా ఉన్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

- రామన్నగూడెం వద్ద 14.48 మీటర్ల మేర వరద ప్రవాహం
- రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు


రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి

ఏటూరునాగారం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వరద గంట గంటకు పెరుగుతోంది. మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీటి మట్టం శుక్రవారం ఉదయం 10 గంటలకు 14.09 మీటర్లు ఉండగా, రాత్రి 8 గంటలకు 14.48 మీటర్లకు చేరింది. గంటగంటకు వరద నీరు పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరికకు (14.80 మీటర్లు) చేరువలో వరద ప్రవాహం కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను గోదావరి చుట్టూ పక్కల గ్రామాల్లో సిద్ధం చేసి ఉంచారు. వారి వద్ద పడవలు, లైఫ్‌జాకెట్లతో పాటు రబ్బర్ బోట్లను ఉంచారు. ఎక్కడైనా విపత్తు ప్రమాదం జరిగితే వెంటనే పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులకు ప్రజలు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. కోయగూడ ఎల్లాపురం గ్రామంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలున్నాయని, ఎలాంటి భయాందోళనకు గ్రామస్తులు గురికావొద్దని అవగాహన కల్పించినట్లు రామన్నగూడెం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు.

ప్రాణహిత పరవళ్లు

- కాళేశ్వరం ఘాట్ వద్ద 11.790 మీటర్ల నీటిమట్టం
- మేడిగడ్డ బ్యారేజీ వద్ద 8.68 లక్షల క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో


కాళేశ్వరం పుష్కర ఘాట్ మెట్లను తాకుతూ ప్రవహిస్తున్న వరదనీరు

కాళేశ్వరం: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత వరద కాళేశ్వరం వద్ద గోదావరితో కలిసి నాలుగు రోజులుగా ఉగ్రరూపం దాల్చుతూ ఉప్పొంగి ప్రవహిస్తోంది. తెలంగాణలో అంతగా వర్షాలు లేకపోవడంతో గోదావరిలో అంతగా నీరు లేదు. మహారాష్ట్ర ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 11.790 మీటర్ల ఎత్తులో నీటిమట్టం దిగువకు ప్రవహిస్తోంది. త్రివేణి సంగమం వద్ద సరస్వతి నది పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన రెండు జ్ఞానదీపాలు నీటమునిగి కొంతమేర మాత్రమే పైకి కనిపిస్తున్నాయి. రాత్రివరకు పూర్తి స్థాయిలో మునిగిపోనున్నాయి. దిగువన ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీకి వరద ప్రవాహం 8.68 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుండగా, 85గేట్లు ఎత్తివేయడంతో అదే స్థాయిలో నీటిని దిగువకు ఇంజనీరింగ్ అధికారులు విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలోని గోసిఖుర్ద్ డ్యామ్ నీరు వదలడంతో రాత్రి వరకు మరింత వరద నీరు చేరుతుందని తెలిసింది.

టేకులగూడెం వంతెన మూసివేత

ములుగు రూరల్: గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అనుసంధాన జాతీయ రహదారి నంబర్ 163పై టేకులగూడెం వంతెనను మూసి వేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వాజేడు మండలం పేరూరు పోలీస్‌స్టేషన్ పరిధి టేకులగూడెం శివారులో రేగమాగు వాగు పొంగి వంతెన మీదుగా వరదనీరు ప్రవహిస్తోందని పేర్కొన్నారు. వరద ఉధృత్తి కారణంగా వంతెనపై ప్రయాణాలను నిషేధించినట్లు తెలిపారు. ఈ క్రమంలో సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తే భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం మీదుగా వెళ్లాలని తెలిపారు.

విద్యుత్ అంతరాయాలు తగ్గాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ అంతరాయాలు తగ్గాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈ, ఎస్ఏఓ, ఏఏఓలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్కిల్, డివిజన్ల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ 16 సర్కిళ్ల పరిధిలో ముందుగా వేయి ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్లు 15 నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో ఉండే పొడవాటి లైన్లలో అమర్చుతున్నట్లు తెలిపారు. తద్వారా విద్యుత్ అంతరాయాలను త్వరగా గుర్తించి పరిష్కరించనున్నట్లు వివరించారు. ఈ నెలలో 30 సబ్‌స్టేషన్లలో, వచ్చే నెలలో 120 సబ్ స్టేషన్లలో రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న లూజు లైన్‌లు, వంగిన స్తంభాలు, తుప్పు పట్టిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు, లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్‌ను గుర్తించి ఆ సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ఈ నెలాఖరు వరకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించే లైన్ల పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు టి.మధుసూదన్, సి.ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, కె.తిరుమల్ రావు, రాజు చౌహాన్, అశోక్, వెంకట రమణ, ఆర్.చరణ్ దాస్, జనరల్ మేనేజర్లు వేణుబాబు, కృష్ణ మోహన్, వాసుదేవ్, సత్యనారాయణ, అన్నపూర్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కంబాలపల్లి పాఠశాలకు అరుదైన అవకాశం

- ఐఐటీ మద్రాస్ స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగస్వామ్యం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అరుదైన అవకాశం దక్కింది. ఐఐటీ మద్రాస్ స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగస్వామిగా ఎంపికైంది. ఈ ఏడాది మహబూబాబాద్ జిల్లా నుంచి ఇప్పటి వరకు ఈ ప్రోగ్రాంలో నమోదు చేసుకున్న పాఠశాలలు మొత్తం ఐదు కాగా, కంబాలపల్లి పాఠశాల వాటిలో ఒకటిగా ఎంపిక కావడం విశేషం. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు ఆధునిక రంగాల్లో విద్యను అందించడంతోపాటు భవిష్యత్‌లో తగిన కెరీర్ ఎంపిక చేసుకునే అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు 8 వారాలపాటు 10 ఆన్‌లైన్ కోర్సులు చదివే అవకాశం కలుగుతుంది. ఈ కోర్సులను ఐఐటీ మద్రాస్, ఇతర ప్రముఖ విద్యాసంస్థల నిపుణులు రూపొందించారు.



కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కోర్సుల వివరాలు	ప్రధాన అంశాలు	మరింత సమాచారం
• డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పరిచయం • ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ పరిచయం • ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్ పరిచయం • ఇంజినీరింగ్ బయాలాజికల్ సిస్టమ్స్ పరిచయం • ఫన్ విత్ మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్ • లా పరిచయం • మ్యాథ్స్ గేమ్స్ అండ్ పజిల్స్ • ఏరోస్పేస్ ఫండమెంటల్స్ వంటి మొదలైన అంశాలపై శిక్షణ	➤ కోర్సుల వ్యవధి : 8 వారాలు (ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి ప్రారంభం) ➤ పరిశీలన : ప్రతి కోర్సుకు రూ.500 మాత్రమే రుసుం ➤ సర్టిఫికెట్ : కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ఇ–సర్టిఫికెట్ లభిస్తుంది	• విద్యార్థులు ఈనెల 25వ తేదీలోపు నమోదు చేసుకోవాలి • కోర్సు అనంతరం ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ జారీ చేస్తారు • పాఠశాల తరఫున బాధ్యత వహించే విధంగా పాఠశాల (గణితం) సహాయ ఉపాధ్యాయులు కాసం శ్రీనివాసరావు ఎస్పీఓసీ (సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్)గా నియమితులయ్యారు

జోధ్‌పూర్ వ్యవసాయ మార్కెట్ సందర్శన


జోధ్‌పూర్ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వరంగల్ చౌరస్తా: రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ వ్యవసాయ మార్కెట్ యార్డును తెలంగాణ రైతు సంఘం ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. జోధ్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి రాంసింగ్ సిసోడియా, పండ్లు, కూరగాయల మార్కెట్ సెక్రటరీ దుర్గారామ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజేందర్ పరివార్, కార్యదర్శి ధర్మేందర్ బండారి, కార్మిక నాయకులు సకూర్ ఘోరీతో సంఘం జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్ రావు, ప్రతినిధులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అక్కడ రైతుల నుంచి పంట దిగుమతి చార్జీలు మినహా ఎలాంటి మార్కెట్ చార్జీలు వసూలు చేయడం లేదని, మార్కెట్ సెస్ రూ.100కు 1.50 రూపాయలు వసూలు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్మిక చార్జీలు నూటికి 3.60 రూపాయలు పంట కొనుగోలుదారుడు చెల్లిస్తాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోర్తాల చందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్లలో పంటలను విక్రయించే కమిషన్ ఏజెంట్లు అదనంగా రైతుల నుంచి కమిషన్, మునిం, దానం, ధర్మం కూటుకు కిలో పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హర్యానా, పంజాబ్, చండీగఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని వ్యవసాయ మార్కెట్ చట్టాల మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ చట్టాలను సవరించాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు సంగతి సాంబయ్య, చంద్రశేఖర్, మాదం తిరుపతి, సందెపోగు ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువత వీరంగం

- ఇద్దరిపై దాడి.. ఒకరి పరిస్థితి విషమం
- ఎంజీఎం ఆస్పత్రికి తరలింపు


కేడల నరేష్


బజ్జూరి వంశీ

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో యువత గంజాయి మత్తులో వీరంగం సృష్టిస్తోంది. అర్ధరాత్రి వరకు బైకుల హారన్ల మోత, కేరింతలతో రహదారులపై ఆకతాయిలు చక్కర్లు కొడుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై విరుచుకు పడుతున్నారు. ఈ క్రమంలో బీట్ పోలీసులు ఉన్నా లేనట్లేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. అడిగింది ఇవ్వకపోతే చిరువ్యాపారులపై మత్తులో ఉన్న పోకిరీలు విచక్షణ రహితంగా దాడికి తెగబడుతున్నారు. ఈ తరహా ఘటన గురువారం అర్ధరాత్రి వరంగల్ శంభునిపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రంగశాయిపేట గవిచర్ల క్రాస్ రోడ్డులోని ఓ ఐస్‌క్రీమ్ బండి వద్ద కొంతమంది ఐస్‌క్రీమ్ తిన్నారు. డబ్బులు ఇవ్వాలని అడిగితే ఆ చిరు వ్యాపారితో పాటు అడ్డుకోబోయిన కేడల నరేష్, బజ్జూరి వంశీపై ఆకతాయిలు దాడికి చేశారు. ఈ దాడిలో కేడల నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న స్థానిక మిల్స్ కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించినట్లు సమాచారం.

మృతదేహం మా వారిది కాదు..

- దహన సంస్కారాలు చేసే సమయంలో కుటుంబ సభ్యుల గుర్తింపు
- తిరిగి ఎంజీఎం ఆస్పత్రికి తరలింపు
- పోలీసుల వినతి మేరకు పోస్టుమార్టం లేకుండా బంధువులకు అప్పగించాం
- ఎంజీఎం ఆర్ఎంఓ శశికుమార్ వెల్లడి


ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) మృతదేహం

రాయపర్తి: 'రోడ్డు ప్రమాదంలో నీ భర్త మృతిచెందాడ'ని పోలీసులు సమాచారం అందించడంతో వరంగల్ ఎంజీఎంకు వెళ్లిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహాన్ని తీసుకెళ్లి దహన సంస్కారాలు చేసే క్రమంలో మృతదేహం తమవారిది కాదని గుర్తించి.. తిరిగి ఎంజీఎం ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ విచిత్ర ఘటన శుక్రవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన గోక కుమారస్వామి(55), రమకు ముప్పయి ఏళ్లక్రితం వివాహమైంది. వారికి ఒక కూతురు. ఇరవై ఏళ్ల క్రితం కుమారస్వామి మతిస్థిమితం కోల్పోగా అప్పటినుంచి రమ వేరుగా ఉంటున్నారు. అతను మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణకేంద్రంలో యాచిస్తూ జీవిస్తున్నాడు. తొర్రూరులో ఈనెల 09వ తేదీన రోడ్డుపక్కన అపస్మారకస్థితిలో పడి ఉండగా స్థానికులు, పోలీసుల సాయంతో అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మరుసటి రోజు గురువారం మృతిచెందాడు. ఈ క్రమంలో ఎంజీఎంనుంచి పోలీసులు 'నీ భర్త చనిపోయాడని' మైలారానికి చెందిన గోక రమకు సమాచారం అందించారు. ఆస్పత్రికి వెళ్లిన రమ, కుటుంబ సభ్యులకు మార్చురీనుంచి చాపతో చుట్టిన మృతదేహాన్ని అప్పగించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో నేరుగా మైలారంలోని దహనసంస్కారాలు చేసే స్థలానికి తీసుకొచ్చారు. కిందికి దించి చాప విప్పి చూడగా కుమార్తె స్వప్న ఆ మృతదేహాన్ని చూడగా తన తండ్రి చేతిపై శ్రీ అనే పచ్చబొట్టు ఉంటుందని, ఈ మృతదేహానికి పచ్చబొట్టు లేదని, తమ నాన్న కాదని తేల్చిచెప్పింది. భార్య, బంధువులు సైతం చూసి తమవారిది కాదని చెప్పడంతో తిరిగి మృతదేహాన్ని అదే అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. రమ తన భర్తను చాలా ఏళ్లుగా చూడకపోవడం.. చాపలో చుట్టి ఇవ్వడం వల్ల గుర్తించలేకపోయినట్లు కొందరు అంటున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, ఆ మృతదేహం ఎవరిది అన్నది గుర్తించాల్సి ఉంది.

పోలీసుల వినతి మేరకే..

ఎంజీఎం : ఈ నెల 9వ తేదీన అపస్మారకస్థితిలో ఉన్న ఓ వ్యక్తిని ఎంజీఎంకు తీసుకువచ్చారని, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎంజీఎం ఆర్ఎంఓ శశికుమార్ తెలిపారు. కాగా, సదరు వ్యక్తి మృతదేహం రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన కుమారస్వామిగా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. పోస్టుమార్టం లేకుండా అప్పగించాలనే పోలీసుల వినతి మేరకు ఆ మృతదేహాన్ని భార్య, బంధువుల అంగీకారం మేరకు అప్పగించినట్లు ఆర్ఎంఓ తెలిపారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు తమది కాదని పేర్కొని తిరిగి ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు వెల్లడించారు.